

అగ్నిమాపక వారోత్సవాలు

నరసరావుపేటరూరల్: కోటప్పకొండ టీటీడీ వేద పాఠశాలలో మంగళవారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



గ్రంథాలయం సందర్శన

యడ్లపాడు: స్థానిక శాఖా గ్రంథాలయాన్ని మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్రతమ్మ సందర్శించారు. పుస్తకాలు అందుబాటులో ఉంచాలని చెప్పారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5000, గరిష్ట ధర రూ.6500, మోడల్ ధర రూ.5800 వరకు పలికింది.

న్యూస్‌రీల్

పరిశీలకుల కోసం ఏర్పాట్లు చేయండి

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



గుంటూరు వెస్ట్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు రానున్న పరిశీలకులు ఉండేందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక రోడ్లు భవనాల వసతి గృహంలోని గదులను కలెక్టర్, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నియమించే పరిశీలకులు జిల్లాకు రానున్నారని వారికి ఇబ్బందులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ బాధ్యతలను జిల్లా అటవీ శాఖాధికారి మహబూబ్ బాషాకు అప్పగించారు. కలెక్టర్‌తో ఆర్డీఓ పి.శ్రీకర్, డీఎస్‌ఓ కోమలి పద్మ, అధికారులు ఉన్నారు.

నేటి నుంచి ఏబీసీకి నీరు విడుదల

డీఈ రామారావు



శావల్యాపురం: తాగునీటి అవసరాల నిమిత్తం అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు సాగర్ జలాలు విడుదల చేస్తున్నట్లు ఎన్నెస్పీ డీఈ చాట్రగడ్డ రామారావు తెలిపారు. మంగళవారం మండలంలోని పోట్లూరు వద్ద అద్దంకి బ్రాంచ్ కెనాల్(ఏబీసీ)ని పరిశీలించారు. డీఈ మాట్లాడుతూ ఈనెల 8న సాగర్ జలాశయం నుంచి 5,500 క్యూసెక్కులు విడుదల చేసినట్లు చెప్పారు. ఈనెల 12వ నాటికి కెనాల్‌కు నీరు చేరిందని, ఇప్పటి వరకు ప్రకాశం జిల్లా పరిధిలో అన్ని మేజరు కాలువలకు 900 క్యూసెక్కులు సరఫరా చేసినట్లు వివరించారు. పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏబీసీ పరిధిలోని 26 మేజరు కాలువలకు 900 క్యూసెక్కులు విడుదల చేశామన్నారు. మంచినీటి చెరువులు, వాగులు, కుంటలు నూరుశాతం సాగర్ జలాలతో నింపాలని కోరారు. నీటిని తాగునీటి అవసరాల నిమిత్తమే వినియోగించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముందుస్తు జాగ్రత్తల్లో భాగంగా శావల్యాపురం పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఈనెల 25వ తేదీ వరకు సాగర్ జలాలు సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నెస్పీ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో మంచినీటి చెరువులన్నీ పూర్తి స్థాయిలో నింపే బాధ్యత తీసుకోవాలని కోరారు. ఆయనతో పాటు ఏఈ పోట్లూరి లక్ష్మీనారాయణ, ఎన్నెస్పీ సిబ్బంది నందకిషోరు ఉన్నారు.

108 ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్ : జిల్లాలో అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ 108 అంబులెన్సులో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ) ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 జిల్లా మేనేజర్ జి.నాగదీప్ తెలిపారు. అభ్యర్థులకు బీఎస్సీ, బీఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్, డీఎంఎల్టీ ఐదేళ్ల అనుభవం అర్హతతోపాటు 35 సంవత్సరాల్లోపు వయస్సు ఉండాలన్నారు. ప్రత్తిపాడు, తెనాలి, మంగళగిరి, వట్టిచెరుకూరు, తుళ్లూరు, ఫిరంగిపురం, కొల్లిపర మండలాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. అర్హత ఉన్నవారు తమ సర్టిఫికెట్లతో ఈ నెల 20వ తేదీ లోపు గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయం రెండో అంతస్తులోని తమ ఆఫీసులో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు 9121892889 నంబరు సంప్రదించాలన్నారు.

యార్డులో 88,620 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 68,903 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 88,620 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 19,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 64,678 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

ఆదర్శం.. ఆత్మకూరు కాలనీ

పేదింటి సౌభాగ్యం

- రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రెండు సెంట్లు కేటాయింపు
- తొలగించిన ఇళ్లకు నష్టపరిహారం చెల్లింపు
- అదనంగా ఇళ్ల నిర్మాణానికి రూ.1.80 లక్షలు
- 12 ఎకరాలలో జగనన్న కాలనీ
- రూ.7 కోట్లతో రోడ్లు, మౌలిక వసతులు
- రికార్డు స్థాయిలో ఇళ్ల నిర్మాణాలు చేసి గృహ ప్రవేశాలు చేసిన లబ్ధిదారులు



ఆత్మకూరు వైఎస్సార్ జగనన్న కాలనీలోని సొంతింటి వద్ద షేక్ షఫియా

ఈమె పేరు షేక్ షఫియా. భర్తతో కలసి బకింగ్ హామ్ కాలువ కట్టపై గుడిసెలో ఉండేవారు. కొడుకు దూర ప్రాంతంలో చిన్న ఉద్యోగం చేసుకుంటున్నాడు. భర్తకు పింఛన్ వస్తోంది. చిన్నచిన్న పనులు చేసుకుని బతుకుతున్నారు. రేషన్ కార్డు కూడా లేకపోవడంతో ప్రభుత్వ పథకాలకు నోచుకోలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన అనంతరం వలంటీర్ వచ్చి రేషన్ కార్డు మంజూరు చేయించారు. ఆమె ఇంటికి నష్టపరిహారంగా రూ.2.50 లక్షలు ఇచ్చారు. దీనికి తోడు జగనన్న కాలనీకి మంజూరు చేసిన మొత్తం రూ.1.80 లక్షలు ఇచ్చారు. అదనంగా కొంత వేసుకుని ఇంటిని సుందరంగా తీర్చిదిద్దుకున్నారు. ఇళ్ల తొలగింపంటే ముందు భయపడ్డాం. జగనన్న చేసిన మేలుతో సొంతింటి కల నెరవేరింది. జగనన్నకు రుణపడి ఉంటామని షేక్ షఫియా ఆనందంగా చెప్పారు.



కట్టపై ఓ పాత ఇల్లు (ఫైల్)



ఆత్మకూరులోని వైఎస్సార్ జగనన్న కాలనీ

ఆత్మకూరు జగనన్న కాలనీ..	
మొత్తం లబ్ధిదారులు	283
పంపిణీకి కేటాయించిన ఎకరాలు	12
పూర్తయిన ఇళ్ల సంఖ్య	215
వివిధ దశల్లో ఉన్న ఇళ్లు	68
స్థలం కొనుగోలుకు ఖర్చు	రూ.11.52 కోట్లు
బాధితులకు నష్టపరిహారం	రూ.7.52 కోట్లు

మంగళగిరి: వాళ్లంతా నిరాశ్రయులు.. అభాగ్యులు.. రెక్కాడితేగాని డొక్కాడని బడుగులు.. పొద్దు పొడవకముందే ఇంటి నుంచి బయటపడేవారు.. పని కోసం నిరీక్షించేవారు.. ఆ రోజు పని దొరికితే చేసుకునేవారు.. లేకుంటే లేదు. వారు గూడు కోసం కాలువ కట్టనే ఆశ్రయించారు. చిన్న పరదాలు వేసుకొని జీవించేవారు. సగం బతుకు రోడ్డుపైనే. టీడీపీ అధికారంలో ఉండగా సుందరీకరణ పేరుతో ఆ పేదలను తరలించేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే సొంతింటి కల సాకారం చేశారు. సౌభాగ్యవంతులను చేశారు. ఆత్మకూరు జగనన్న కాలనీ ఆవిర్భవించింది. ఇది రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచింది.

వలస కూలీలకు సొంత గూడు

తాడేపల్లి బకింగ్ హామ్ కాలువ కట్టను ఆసరా చేసుకుని ఎంతో మంది పేదలు ఎన్నో ఏళ్లుగా ఉండేవారు. సుమారు 283 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఎక్కువ మంది రోజువారీ కూలీలు. ఎక్కడెక్కడి నుంచో వచ్చి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. అక్కడ నివాసం దినదినగండంగా ఉండేది. ఎప్పుడు అధికారులకు కోపం వచ్చినా ఇక్కడ ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చేవారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం పేదలకు ప్రత్యామ్నాయం చూపించిన తరువాతే రోడ్డు విస్తరణకు ఖాళీ చేయించారు. ఆత్మకూరులో పొలాలు కొనుగోలు చేసి స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మాణం చేసి అందజేశారు. తాజాగా రిజిస్ట్రేషన్ పత్రాలు అందించారు. తొలగించిన ఇళ్లకు నష్టపరిహారంగా రూ.7,52,81,553 చెల్లించారు. ఒక్కో నిర్వాసితుడికి రూ.1.50 లక్షల నుంచి రూ.ఏడు లక్షల వరకు నష్టపరిహారం అందింది. ప్రభుత్వం ఉచితంగా రెండు సెంట్ల స్థలం కేటాయించడంతోపాటు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం మంజూరుచేసిన రూ.1.80 లక్షలు, వచ్చిన నష్టపరిహారంతో నిర్వాసితులు వెంటనే ఇళ్ల నిర్మాణం ప్రారంభించి కొందరు ఏడు నెలలకే గృహప్రవేశాలు చేశారు.



కాలనీకి వేసిన రోడ్డు

శరవేగంగా మౌలిక వసతులు

మరో వైపు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి చొరవతో తాగునీరు, విద్యుత్, రోడ్ల వంటి మౌలిక వసతులు అధికారులు వెంటనే ఏర్పాటు చేశారు. తాడేపల్లి జాతీయ రహదారి నుంచి వడ్డేశ్వరం, ఇప్పటం మీదుగా అప్రోచ్ రోడ్డు, మంగళగిరి నుంచి పెదవడ్లపూడి మీదుగా మరో అప్రోచ్ రోడ్డు రూ.4 కోట్లతో వేశారు. మరో రెండున్నర కోట్లు వెచ్చించి తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించారు.

ఆనందమంటే ఇప్పుడే...



కట్ట విస్తరణ కోసం ఇళ్లు తొలగించిన సమయంలో ఆందోళన చెందాం. ఎమ్మెల్యే ఆర్కే అండగా ఉన్నారు. జగనన్న భరోసా కల్పించారు. తొలగించేటప్పుడు ఇచ్చిన హామీ మేరకు రెండు సెంట్ల స్థలం ఇచ్చారు. నష్టపరిహారంగా రూ.2.80 లక్షలు ఇచ్చారు. ప్రభుత్వం నుంచి రూ.1.80 లక్షలు ఇప్పించారు. సొంతిల్లు నిర్మించుకుని ఆనందంగా ఉన్నాం. గతంలో ప్రభుత్వ నీరుపారుదల శాఖ కట్టపై ఉన్నప్పుడు ఎప్పుడు ఇళ్లు తొలగిస్తారో అనే ఆందోళన ఉండేది. ఇప్పుడు అలాంటిది లేకుండా ప్రశాంతంగా జీవిస్తున్నాం. టీడీపీ పాలనలో సీతానగరంలో తొలగించిన వారికి కనీసం స్థలం కూడా ఇవ్వలేదు.

– బళ్ల సావిత్రి,
ఆత్మకూరు వైఎస్సార్ జగనన్న కాలనీ

అన్ని వసతులు కల్పించారు



నాకు ఇద్దరు పిల్లలు. నేను, నా భర్త చినవెంకటరెడ్డి కూలిపనులు చేసుకునే వారం. పిల్లల్లో ఒకరు ఇంటర్, మరొకరు తొమ్మిదో తరగతి చదువుతున్నారు. గతంలో బకింగ్ హామ్ కాలువ కట్టపై నివసించేవారం. అది తొలగించి నష్టపరిహారంగా రెండు లక్షలు మంజూరు చేశారు. ఆత్మకూరు వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు కట్టుకునేందుకు రూ.1.80 లక్షలు ప్రభుత్వం ఇచ్చింది. దీంతో ఇక్కడ ఇల్లు నిర్మించుకున్నాం. రోడ్లతో పాటు తాగునీరు, కరెంట్ తదితర అన్ని సౌకర్యాలు కల్పించారు. జగనన్న ప్రభుత్వం ఏర్పడిన అనంతరం అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా, విద్యావసతి లాంటి పథకాలు రావడంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా పిల్లలతో ఆనందంగా జీవించగలుగుతున్నాం.

– రాగి రమాదేవి,
ఆత్మకూరు వైఎస్సార్ జగనన్న కాలనీ

నామినేషన్.. బీ అలర్ట్



రాజకీయపార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్

- రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ
- నిబంధనలు వర్తిస్తాయంటున్న రిటర్నింగ్ అధికారి శ్రీకర్

ప్రత్తిపాడు: ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టానికి సమయం ఆసన్నమైంది. మరో 24 గంటల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మొదలు కానుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల బరిలో నిలవాలనుకునే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో పాటించాల్సిన నిబంధనలను, కచ్చితంగా సమర్పించాల్సిన పత్రాలను ఎన్నికల అధికారులు వివరించారు. అంతేకాకుండా నామినేషన్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్ మీడియాకు వివరించారు. ఇందుకు సంబంధించిన ఒక ప్రకటనను ఆయన మంగళవారం విడుదల చేశారు.

- నామినేషన్లను ప్రభుత్వ సెలవు రోజుల్లో కాకుండా షెడ్యూల్ ప్రకారం ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు స్వీకరిస్తారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే నామినేషన్లు తీసుకుంటారు.
- నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థి భారత పౌరుడై ఉండటంతోపాటు 26-04-2024 నాటికి 25 సంవత్సరాలు వయస్సు పైబడి ఉండాలి.
- నామినేషన్‌ను ఫారం 2–బిలో రిటర్నింగ్ అధికారికి దాఖలు పరచాలి.
- నవీకరించబడిన ఫామ్–26(నామినేషన్ అఫిడవిట్)ను జత చేయాలి. ఫారం–26లో ఏ ఒక్క కాలమ్ కూడా సమాచారం నింపకుండా ఖాళీగా వదలకూడదు. ఖాళీలు ఉంటే నామినేషను తిరస్కరిస్తారు. పూర్తిగా నింపిన ఫామ్–26 నామినేషన్‌ను 25వ తేదీ సాయంత్రం 3 గంటల్లోపు దాఖలు చేయాలి. ఫామ్–26 లో ప్రతి పేజీపై అభ్యర్థి సంతకం, నోటరీ స్టాంపు, సంతకం ఖచ్చితంగా ఉండాలి.
- ప్రత్తిపాడు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం కావడంతో నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు రూ.5000 సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలి. నేరుగా దాఖలు సమయంలో నగదును చెల్లించవచ్చు. లేదా చలానా ద్వారా కూడా చెల్లించవచ్చు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కుల ధృవీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది.
- గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు వారు నిలబెట్టిన వ్యక్తులకు ఫామ్–ఏ, ఫామ్–బిలను నామినేషను మొదలైన రోజు నుంచి నామినేషన్ ముగిసే రోజు సాయంత్రం మూడు గంటల్లోపు అందించాలి.
- అభ్యర్థులు నాలుగు ఫొటోలను (2 సెం.మీ వెడల్పు, 2.5 సెం.మీ ఎత్తు) కలర్ లేదా బ్లాక్ అండ్ వైట్ ఫొటోలు ఇవ్వాల్సి ఉంటుంది. అందజేసే ఫొటో నామినేషను సమర్పించే నాటికి 3 నెలల ముందు తీసుకున్న ఫొటో అని డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది.
- పోటీ చేసే అభ్యర్థి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, ఏ నియోజకవర్గంలోనైనా ఓటరుగా ఉండవచ్చు. వేరే నియోజకవర్గంలో ఓటరుగా ఉన్న వారు ఆర్వో లేదా ఏఆర్వో నుంచి సర్టిఫైడ్ కాపీ ఆఫ్ ఎలక్టోరల్‌ను జతపరచాల్సి ఉంటుంది. అయితే ప్రతిపాదకుడు మాత్రం కచ్చితంగా అభ్యర్థి పోటీ చేసే నియోజకవర్గములో ఓటరై ఉండాలి.
- అభ్యర్థి ప్రతిజ్ఞను ఖచ్చితంగా 25వ తేదీ 11.59 గంటల్లోపు చదివి సంతకం చేయాలి.
- అభ్యర్థి నమూనా సంతకం ఒక ఫామ్‌పై విడిగా ఇవ్వాలి.
- అభ్యర్థి పేరు ఏ విధంగా బ్యాలెట్ పేపర్‌లో ఉండాలని భావిస్తున్నారో స్పష్టంగా తెలియజేయాలి.
- గుర్తించబడిన జాతీయ, రాష్ట్ర పార్టీ అభ్యర్థులకు ఒక ప్రతిపాదకుడు పోటీ చేసే నియోజకవర్గ ఓటరుగా ఉండాలి. గుర్తించబడని రిజిస్టర్ పార్టీల వారు, స్వతంత్ర అభ్యర్థులను ఆ నియోజకవర్గంలోని ఓటరుగా ఉన్న 10 మంది వ్యక్తులు ప్రతిపాదించవచ్చు.
- రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల పరిధి వరకు మూడు వాహనాలు మాత్రమే అనుమతిస్తారు.
- నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితోపాటు ఐదుగురు వ్యక్తులను మాత్రమే నామినేషను దాఖలు చేసేందుకు ఆర్వో కార్యాలయం లోపలకు అనుమతిస్తారు.
- అభ్యర్థి లేదా ప్రతిపాదకుడు మాత్రమే నామినేషను పత్రం సమర్పించాల్సి ఉంటుంది.
- ఒక అభ్యర్థి తరఫున నాలుగు (4) సెట్లు నామినేషను పత్రాలను మాత్రమే దాఖలు చేయవచ్చు. అంతకు మించి అనుమతించరు. నాలుగు సెట్లు ఒకేసారి లేదా విడివిడిగా కూడా సమర్పించవచ్చు.
- నామినేషను దాఖలు తేదీకి ఖచ్చితంగా ఒకరోజు ముందుగా అభ్యర్థి పేరున లేదా అభ్యర్థి పేరు ఎలక్షన్ ఏజెంట్ పేరున జాయింట్ బ్యాంకు ఖాతాను తెరచి వివరాలను సమర్పించవలెను.
- అభ్యర్థులపై క్రిమినల్ కేసులు ఉంటే ఖచ్చితంగా న్యూస్ పేపర్, టీవిలలో ప్రకటన రూపంలో మూడుసార్లు తెలియజేయాలి.
- 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది.

జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకుందాం

- పేదలంతా ఒక్కటై జగనన్నకు మద్దతు పలకాలి
- సంక్షేమం కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలి
- చంద్రబాబుకు ఓటు వేస్తే భవిష్యత్తుకు సమాధే
- ఎన్నికల్లో గెలుపు కోసం ఎన్ని అబద్ధాలైనా ఆడతారు
- నయవంచకుల మాటలు నమ్మి మోసపోవద్దు
- ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్య, ఎమ్మెల్యే మద్దాళి గిరితో కలసి ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి రజిని, గుంటూరు ఎంపీ అభ్యర్థి రోశయ్య, ఎమ్మెల్యే గిరి



వేదపండితుని ఆశీర్వచనం అందుకుంటున్న మంత్రి రజిని, గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి

పట్నంబజారు: సమాజంలో అత్యధిక శాతం ఉన్న పేద వర్గాలకు న్యాయం జరగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని అన్నారు. గుంటూరు నగరం పట్నంబజారు ఇసుక డొంక ప్రాంతంలో మంగళవారం ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్య, ఎమ్మెల్యే మద్దాళి గిరితో కలసి మంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మంత్రి రజిని ఓట్లు అభ్యర్థించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు కోసం చంద్రబాబునాయుడు ఎన్ని అబద్ధాలైనా ఆడతారని దుయ్యబట్టారు. 2014లో ఇదే కూటమి ఎన్నో తప్పుడు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిందని, గెలిచాక తెప్ప తగలేసినట్టు వాగ్దానాలన్నీ మూట కట్టి మూలన పడేసిందన్నారు. అటువంటి నయవంచకుల మాటలు నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధి సమపాళ్లలో జరగాలంటే వైఎస్సార్ సీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే నగర అభివృద్ధి ఎమ్మెల్యే కిలారి రోశయ్య

వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంటు అభ్యర్థి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఐదేళ్లలోనే నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. నగరంలో ప్రధానమైన రహదారులు నిర్మాణం చేశామని, టీడీపీ హయాంలో నిర్లక్ష్యంగా వదిలివేసిన గాంధీ పార్కును అభివృద్ధి చేసి, సుందర నందనవనంగా తీర్చిదిద్దామన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డులో శిల్పారామం అభివృద్ధి చేసి ప్రారంభించామన్నారు. కోట్లాది రూపాయలతో కూరగాయల మార్కెట్ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు.

రజినమ్మకు అపూర్వ స్వాగతం పలికిన మార్వాడీ మహిళలు

ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి రజిని ఆర్.అగ్రహారం మెయిన్ రోడ్డు, ఇసుక వాగు వీధి, శివాలయం బజారు, నరసింహస్వామి గుడి రోడ్డు ప్రాంతాల్లో పర్యటించారు. ఆ ప్రాంతంలో ఎక్కువగా ఉన్న మార్వాడీ కుటుంబాల నుంచి మంత్రి రజినమ్మకు అపూర్వ స్వాగతం లభించింది. మార్వాడీ మహిళలు మంత్రి రజినికి ఎదురేగి స్వాగతం పలికారు. మంత్రి వారిని ఆప్యాయంగా పలకరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, మార్వాడీ సంఘ నాయకులు అమృత్‌రాజ్, మహవీర్, వినోద్, వైఎస్సార్ సీపీ నాయకులు నూనె కిషోర్, ఉడతా మహేష్, వైఎస్సార్ సీపీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు శోభాయాత్ర

- శ్రీరామనవమికి ముస్తాబైన నగరం
- భారీగా హాజరు కానున్న శ్రీరామ..హనుమాన్ భక్తులు



పట్నంబజారు: గుంటూరు నగరంలో బుధవారం శోభాయాత్ర వైభవోపేతంగా జరగనుంది. ప్రతి ఏటా శ్రీరామ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న రథయాత్ర ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించనున్నారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం జరగనున్న శోభయాత్రకు సంబంధించి ఇప్పటికే ఉత్సవ సమితి సభ్యులు ఏర్పాట్లుచేశారు. నగరాన్ని శ్రీరాముని చిత్రపటాలు, గోడ పత్రికలు, కాషా య రంగు తోరణాలతో ముస్తాబు చేశారు. యాత్ర బృందావన్‌గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన లక్ష్మీపురం, లాడ్జిసెంటర్, శంకర్‌విలాస్, ఓవర్‌బ్రిడ్జి, ఉమెన్స్ కాలేజీ రోడ్డు, నాజ్‌సెంటర్, ఓల్డ్‌క్లబ్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, ఎన్టీఆర్ సర్కిల్, బ్రహ్మానందరెడ్డి స్టేడియం, పాతబస్టాండ్, జిన్నాటవర్ సెంటర్, హిమని సెంటర్, కన్యకాపరమేశ్వరి ఆలయం, నల్లచెరువు మూడు బొమ్మల సెంటర్, ఎత్తురోడ్డు, చుట్టుగుంట మీదుగా మల్లారెడ్డినగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయం వద్దకు చేరుకుంటుంది. ఉదయం 9.11 గంటలకు రథయాత్ర ప్రారంభం కానుంది.

తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి

గుంటూరు వెస్ట్: వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుంచి మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. జవహర్‌రెడ్డి నిర్వహించిన వీడియో సమావేశంలో స్థానిక కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో కలెక్టర్ మాట్లాడారు. నాగార్జున సాగర్ కుడి కాలువ, కృష్ణా వెస్ట్రన్ డెల్టా కెనాల్‌కు విడుదలవుతున్న నీటిని ఆయా పరిధిలోని చెరువుల్ని నింపేందుకు యుద్ధప్రాతిపదికన పని చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఈ రెండు కాలువల పరిధిలోని 65 తాగునీటి చెరువుల్ని నింపామని చెప్పారు. ప్రత్తిపాడు మండల పరిధిలోని చెరువులకు రెండు రోజుల్లో నీరు సరఫరా అయ్యే అవకాశముందని తెలిపారు. గుంటూరు చానల్‌కు కూడా రెండు రోజుల్లోనే నీటి సరఫరా జరిగే అవకాశముంటుందని పేర్కొన్నారు. దీని పరిధిలోని 25 చెరువులకు కూడా తాగునీటిని అందిస్తామని వివరించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, ఇరిగేషన్ ఎస్ఈ ఉమామహేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



లక్ష్మీపురం: గుంటూరు రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారంపై అనారోగ్యంతో బాధపడుతున్న గుర్తు తెలియని వ్యక్తిని గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. రైల్వే జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 55 సంవత్సరాల వయస్సున్న ఓ వ్యక్తి ఫిబ్రవరి 20న గుంటూరు రైల్వే స్టేషన్‌లో నాలుగో ప్లాట్‌ఫారంపై అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీన్ని గమనించిన హౌస్ కీపింగ్ సూపర్‌వైజర్ మల్లికార్జునరావు 108 ద్వారా గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. దీంతో జీఆర్పీ పోలీసులు గుర్తు తెలియని మృతిగా కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9440627546, 9908383300 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గుంటూరు 'మణి దీప'ం

- యూపీఎస్సీ ఫలితాల్లో నగరానికి చెందిన అశ్విన్ మణిదీప్‌కు 148వ ర్యాంకు
- రెండో ప్రయత్నంలో ఐపీఎస్ సాధన
- మొదటిసారి 238వ ర్యాంకుతో ఐఆర్ఎస్‌కు ఎంపిక
- ప్రస్తుతం నాగపూర్‌లో శిక్షణ



తల్లిదండ్రులతో అశ్విన్ మణిదీప్ (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ఐఏఎస్, ఐపీఎస్ సాధనే లక్ష్యంగా సన్నద్ధమైన అతని ఆకాంక్ష ఎట్టకేలకు ఫలించింది. యూపీఎస్సీ మంగళవారం ప్రకటించిన సివిల్స్ ఫలితాల్లో గుంటూరులోని శ్యామలానగర్‌కు చెందిన కాకుమాను అశ్విన్ మణిదీప్ అఖిల భారతస్థాయిలో 148వ ర్యాంకర్‌గా నిలిచారు. 2021లో తొలిసారిగా సివిల్స్ రాసి, 238వ ర్యాంకు సాధించిన అశ్విన్ మణిదీప్ ఐఆర్ఎస్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం నాగపూర్‌లో శిక్షణలో ఉన్నారు. తండ్రి కిశోర్ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తుండగా, తల్లి ఉమాదేవి ఇంటి వద్దే ట్యూషన్లు చెబుతున్నారు. పాఠశాల విద్య శ్యామలానగర్‌లోని శ్రీవేంకటేశ్వర బాల కుటీర్‌లో పూర్తి చేసిన మణిదీప్ సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో 10 జీపీఏ సాధించారు. ఆ తరువాత తిరువనంతపురంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఐఎస్టీ)లో ఏరో స్పేస్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు.

పాఠశాల వేదికగా సివిల్స్‌కు పునాది

2012లో అశ్విన్ మణిదీప్ పదో తరగతి చదువుతున్న సమయంలో సివిల్స్‌పై బలమైన పునాది ఏర్పడింది. పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న అప్పటి గుంటూరు జిల్లా కలెక్టర్, ప్రస్తుత పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్. సురేష్‌కుమార్ చెప్పిన మాటలు అతనికి ప్రేరణగా నిలిచాయి. సివిల్స్ గొప్పతనం, సామాజిక ఉన్నతస్థాయి ప్రభుత్వ అధికారిగా సమాజానికి దగ్గర కావచ్చునని చెప్పిన మాటలు స్ఫూర్తిని కలిగించాయి. తల్లిదండ్రులు ఇచ్చిన ప్రోత్సాహంతో తన గమనాన్ని మలచుకున్న మణిదీప్ 2021లో సివిల్స్ రాసి 238వ ర్యాంకు సాధించారు. ఐఆర్ఎస్‌తో సరిపెట్టుకోకుండా ఐఏఎస్ సాధించే లక్ష్యంతో ముస్సోరిలో శిక్షణ పొందుతూ సెలవుపై గుంటూరు వచ్చి ఇంట్లోనే శిక్షణ లేకుండా, సొంతంగా ప్రామాణిక పుస్తకాలను చదివి 2023లో సివిల్స్ రాశారు. తాజాగా విడుదలైన ఫలితాల్లో 148వ ర్యాంకు సాధించి, ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. తనయుడు సాధించిన విజయానికి తల్లిదండ్రులు మురిసిపోతున్నారు. అశ్విన్ మణిదీప్‌ను కెరీర్ పరంగా ప్రోత్సహిస్తూ వచ్చిన ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు అభినందనలు తెలియజేశారు.

అపర భద్రాద్రిలో కొలువైన 'అందాల రాముడు'



దివ్య అలంకరణలో ఉత్సవమూర్తులు (ఫైల్)



కల్యాణోత్సవాలకు ముస్తాబైన దేవాలయం

- చిన్న భద్రాద్రిగా యనమదల సీతారామస్వామి ఆలయం ప్రసిద్ధి
- 201వ కల్యాణోత్సవానికి ముస్తాబు
- క్రీ.శ 1824 నుంచి నిర్విరామంగా నిర్వహణ
- ప్రారంభమైన కల్యాణోత్సవాలు
- 17న రాములవారి కల్యాణం
- 18న మహాసామ్రాజ్య పట్టాభిషేకం, 131వ రథోత్సవం

యనమదల (ప్రత్తిపాడు): రెండవ భద్రాద్రిగా పేరుగాంచిన యనమదలలో కొలువుదీరిన కోదండరాముడు 201వ కల్యాణోత్సవానికి ముస్తాబయ్యాడు. ట్రస్టీలు, గ్రామస్తులు, అధికారులు, అర్చకుల సమష్టి కృషితో ప్రతి ఏటా ఇక్కడ కల్యాణం వైభవోపేతంగా జరుగుతుంది. తాటాకు పందిళ్లు, వేద పండితుల మంత్రోచ్ఛరణలు, భాజాభజంత్రీల నడుమ నవమి వేడుకల్ని 1824 నుంచి క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు.

నేడు కల్యాణం.. రేపు పట్టాభిషేకం

శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని బ్రహోత్సవాల్లో భాగంగా బుధవారం గజ వాహనంపై కల్యాణ రామాలంకారంలో గ్రామోత్సవం జరగనుంది. పన్నెండు గంటలకు సీతారామస్వామి, శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వార్ల కల్యాణోత్సవాలను నిర్వహించనున్నారు. రాత్రి గరుడ వాహనంపై శ్రీ మహావిష్ణువు అలంకారంలో గ్రామోత్సవం నిర్వహిస్తారు. కల్యాణం మరుసటి రోజు 18న శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం, సాయంత్రం రాజోచిత అలంకారంతో 131వ దివ్య రథోత్సవం జరగనుంది. 19న వసంతోత్సవం, పూర్ణాహుతి, కల్కి అలంకారంలో కీలు గుర్రంపై గ్రామోత్సవం, 20న ద్వాదశ ప్రదక్షిణలు, పర్యంకాపనం, 21నుంచి 28 వరకు వరకు నిత్యం పవళింపు సేవలు జరగనున్నాయి.

ఒకే శిలలో ఉత్సమూర్తులు కొలువు

యనమదల సీతారామస్వామి దేవాలయానికి రెండవ భద్రాద్రిగా నానుడి. భద్రాద్రిలో ఉన్నట్లుగానే యనమదలలో కూడా సీతారాములు కలిసే ఉంటారు. ఒకే శిలలో స్వామికి వామాంక స్థిత సీతమ్మ అమ్మవారు ఉంటారు. ఇలా తెలుగు రాష్ట్రాల్లో భద్రాచలంలో తరువాత యనమదలలో మాత్రమే ఉన్నట్లు పెద్దలు చెబుతున్నారు. నవమి మర్నాడు గ్రామస్తులంతా కనుల పండువగా 45 అడుగుల ఎత్తుగల రథంపై ఉత్సవాన్ని నిర్వహిస్తారు.

కలప తిరునాళ్లగా నానుడి

కల్యాణోత్సవం మరుసటి రోజు గ్రామస్తులు తిరునాళ్లను జరుపుకుంటారు. ఈ సమయంలో వివిధ ప్రాంతాల నుంచి రకరకాల కలప, చెక్కలు, చెక్క సామగ్రి తరలివస్తాయి. అందువల్ల దీనికి కలప తిరునాళ్లగా మరో పేరు ఉండేదని పూర్వీకులు చెబుతున్నారు. స్వామి వారిని దర్శించుకునేందుకు వేలాదిగా తరలి వచ్చే భక్తలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి, పౌండర్ ట్రస్టీలు తెలిపారు.

సమర్థంగా విధులు నిర్వహించాలి

సెబ్ డెప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

నగరంపాలెం: జిల్లాలో సెబ్ అధికారులు, సిబ్బంది సమర్థంగా విధులు నిర్వహించాలని సెబ్ డెప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసులు చెప్పారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని సెబ్ ఏఎస్పీ కార్యాలయంలో సెబ్ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అక్రమంగా మద్యం నిల్వలున్న గోడౌన్లను గుర్తించాలని, అనధికార కార్యకలాపాలు నిర్వహించే వారిపై నిఘా ఉంచాలని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా జిల్లాకు తరలించే మద్యం రవాణాపై నిఘా ఉంచాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఏఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ ఎల్.రంగారెడ్డి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ కృష్ణకిశోర్‌రెడ్డి, హెడ్ క్వార్టర్స్ ఏఈఎస్ ప్రభాకర్, పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

జగనన్న రుణం తీర్చుకుంటాం

వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలూరి వెంకటరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పోలూరి వెంకటరెడ్డి, న్యాయవాదులు

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలూరి వెంకటరెడ్డి తెలిపారు. అరండల్‌పేటలోని ఆయన కార్యాలయంలో న్యాయవాదులతో కలిసి మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దేవుని ఆశీస్సులు, రాష్ట్ర ప్రజల దీవెనలు ఉన్నంత కాలం ఏ శక్తులు అడ్డుకోలేవని స్పష్టం చేశారు. టీడీపీ, కూటమి ఎన్ని పన్నాగాలు పన్నినా 2024 ఎన్నికల్లో 175కు 175 నియోజకవర్గాలు గెలిచి సత్తా చాటి చెబుతారని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా సంక్షేమ కార్యక్రమాలు అందజేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జిల్లా న్యాయవాదులంతా అండగా ఉంటామని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో న్యాయవాదులంతా సమష్టిగా గుంటూరు ఉమ్మడి జిల్లాలోని 17 నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల్ని గెలిపించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్తకు, పార్టీ నేతలకు న్యాయపరంగా పూర్తిస్థాయిలో అండగా ఉంటామని స్పష్టం చేశారు. న్యాయవాదులకు ఎన్నో విధాలుగా అండగా ఉన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సి.డి.భగవాన్, న్యాయవాదులు పోకల వెంకటేశ్వర్లు, మొండితోక శ్రీనివాస్, న్యాయవాదులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌పై దాడి హేయమైన చర్య

రిటైర్డ్ ఎస్పీ చన్నంశెట్టి చక్రపాణి



పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డిపై దాడి అత్యంత హేయమైన చర్య అని రిటైర్డ్ ఎస్పీ చన్నంశెట్టి చక్రపాణి ఖండించారు. బ్రాడీపేటలోని ఆయన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నీచ రాజకీయాలతో రాష్ట్ర ముఖ్యమంత్రిపై టీడీపీ నేతలు దాడులు చేయించడం సిగ్గుచేటని తెలిపారు. రాజకీయంగా ఆయన్ను ఎదుర్కోలేక హతమార్చేందుకు రాళ్ల దాడి చేయించడం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. చంద్రబాబు తొలి నుంచి హత్యారాజకీయాలకు నాంది పలుకుతూనే ఉన్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీలో ఉన్నదంతా కూలీలంటూ విమర్శలు చేయడం సరికాదని తెలిపారు. ఎవరైనా కూలీలేనని, వారు లేకపోతే మన జీవనం ఎలా సాగుతుందో చంద్రబాబు గుర్తుంచుకోవాలని సూచించారు. ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తే ప్రజలు బుద్ధి చెబుతారని చక్రపాణి హెచ్చరించారు.

ట్రాఫిక్‌పై పూర్తిగా ఆంక్షలు

ప్రత్తిపాడు: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మొదలు కానున్న నేపథ్యంలో ట్రాఫిక్‌పై పూర్తిగా ఆంక్షలు విధిస్తున్నట్లు ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్‌పెక్టర్, నోడల్ ఆఫీసర్ నిసార్ బాషా తెలిపారు. ప్రధాన రాజకీయ పార్టీలైన వైఎస్సార్ సీపీ, తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల నామినేషన్ల రోజు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయన్నారు.

- గుంటూరు నుంచి పెదనందిపాడు, పర్చూరు, ఇంకొల్లుకు వెళ్లే వారు ఏటుకూరు బైపాస్ నుంచి అనంతవరప్పాడు, లేమల్లెపాడు, వట్టిచెరుకూరు, వల్లూరు, వంగిపురం, అబ్బినేనిగుంటపాలెం మీదుగా వెళ్లాలి.
- పర్చూరు నుంచి గుంటూరు వెళ్లే వారు పెదనందిపాడు దాటిన తరువాత వచ్చే ఏబీపాలెం అడ్డరోడ్డు నుంచి ఎడమ వైపునకు తీసుకుని గొట్టిపాడు, ఉన్నవ, బోయపాలెం మీదుగా హైవే ఎక్కి వెళ్లాలన్నారు.
- గుంటూరు నుంచి పర్చూరు వెళ్లే ఆర్టీసీ బస్సులు నామినేషన్ దాఖలు చేసే నాలుగు గంటల సమయం పాటు నేరుగా గుంటూరు నుంచి చిలకలూరిపేట మీదుగా వెళతాయన్నారు. ఈ మేరకు ఆర్టీసీ అధికారులతో మాట్లాడామని, వారు అందుకు ఒప్పుకున్నారని సీఐ తెలిపారు.
- వ్యక్తిగత వాహనాల్లో ప్రత్తిపాడుకు వచ్చే గ్రామస్తులను మాత్రం ఎలాంటి ఆంక్షలు లేకుండా అనుమతిస్తామని ఆయన చెప్పారు. ప్రజలు, ప్రయాణికులు విషయాన్ని గమనించాలని సీఐ కోరారు.

ఎన్నికల విధుల్లో అశ్రద్ధ వద్దు

గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి



కమాండ్ కంట్రోల్ రూమును పరిశీలిస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ తుషార్ డూడీ

పట్నంబజారు: ఎన్నికల కమిషన్ సూచనలకు అనుగుణంగా, పారదర్శకత, నిష్పక్షపాతంతో అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధులు, పాటించాల్సిన నిబంధనలు తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి మాట్లాడుతూ ఈనెల 18 నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు పరచాలని తెలిపారు. జిల్లాలోని నియోజకవర్గాల పోలీసు నోడల్ అధికారులు పూర్తిస్థాయిలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జిల్లాకు సంబంధించి పూర్తి అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలంతా ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. జిల్లాలో ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ గురించి క్షుణ్ణంగా తెలుసుకోవడంతోపాటు, జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. క్యాంపెయిన్‌కు వచ్చే వీవీఐపీలకు భద్రతా ఏర్పాట్లు, అందుకు తగిన ముందస్తు సమాచారం సేకరించాలని, బందోబస్తు జాగ్రత్తగా ఏర్పాటు చేయాలని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. సమావేశంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, అడిషనల్ ఎస్పీలు నిషికేశ్ షలేకే, లా అండ్ ఆర్డర్ ఏఎస్పీ శ్రీనివాసరావు, క్రైమ్ ఏఎస్పీ శ్రీనివాసరావు, ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంత్, ట్రైనీ ఐఏఎస్ మనోజ్ హెగ్డే, వెస్ట్ డీఎస్పీ మహేష్, సౌత్ డీఎస్పీ మహబూబ్ బాషా, ఎస్బీ డీఎస్పీ పోతురాజు, తెనాలి డీఎస్పీ రమేష్, తుళ్లూరు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్, గుంటూరు జిల్లా పోలీసు ఎన్నికల నోడల్ అధికారులు, ఆర్ఐలు శ్రీహరి రెడ్డి, శ్రీనివాసరావు, బ్రహ్మానందం, స్వర్ణలత, ఆయా కార్యాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూం పరిశీలన

ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూం, పోలీసు కంట్రోల్ రూం, సోషల్ మీడియా విభాగం, ఐటీ కోర్ విభాగం, ఎలక్షన్ సెల్ విభాగాలతోపాటు, పలు విభాగాలను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ తుషార్ డూడీతో కలిసి పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

బాపట్ల టౌన్: చెట్టును ఢీకొని ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. చీరాల మండలం తోటవారిపాలేనికి చెందిన వంగర గంగాధర్ తనకు ఆటోను నడిపేందుకు అదే గ్రామానికి చెందిన గుండుబోయిన శ్రీనివాసులు (27)ను డ్రైవర్‌గా తీసుకొని గుంటూరుకు వెళ్తున్నాడు. అప్పికట్ల యార కాలువ సమీపంలోకి వచ్చేసరికి ఆటో అతి వేగంగా వెళుతూ అదుపుతప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందాడు.

జిల్లాలో సజావుగా 'స్లాష్'

- పరీక్ష రాసిన 3,460 మంది విద్యార్థులు
- సాల్ట్ ప్రోగ్రాంలో భాగంగా నిర్వహణ



అంకిరెడ్డిపాలెంలో స్లాష్ నిర్వహణను పరిశీలిస్తున్న డీఈవో శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల్ని మెరుగుపర్చేందుకు అమలు చేస్తున్న సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రోగ్రామ్ (సాల్ట్) లో భాగంగా గుంటూరు జిల్లాలోని ఎంపిక చేసిన పాఠశాలల్లో మంగళవారం స్టేట్ లెవల్ అచీవ్‌మెంట్ సర్వే (స్లాష్) నిర్వహించారు. రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్సీఈఆర్టీ), ఎడ్యుకేషనల్ ఇనీషియేటివ్స్ సంయుక్తంగా 129 ప్రభుత్వ పాఠశాలల్లో నాలుగో తరగతి చదువుతున్న 3,460 మంది విద్యార్థులకు తెలుగు, ఆంగ్ల, గణిత పాఠ్యాంశాల వారీగా ఎంపిక చేసిన రెండు సబ్జెక్టుల్లో పరీక్ష నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ తెలిపారు. భాషా, గణిత సామర్థ్యాల్ని అంచనా వేయడం కోసం నిర్వహించిన పరీక్షలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నట్లు చెప్పారు. ఈసందర్భంగా ఆమె గుంటూరు రూరల్ అంకిరెడ్డిపాలెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్లాష్ నిర్వహణ తీరుతెన్నులను పరిశీలించారు. గుంటూరులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన సమగ్రశిక్ష ఏపీసీ జి. విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల్ని తీర్చిదిద్దేందుకు స్లాష్ ఉపయోగపడుతుందని అన్నారు. డీసీఈబీ కార్యదర్శి జి. లలిత ప్రసాద్ నంబూరులోని జెడ్పీ గరల్స్ హైస్కూల్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, ఏఎంవో ప్రసాద్, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం బి.విజయలక్ష్మి, ఉపాధ్యాయిరాలు రాబియా బసీ, సీఆర్పీలు పాల్గొన్నారు.



